క్లుప్తంగా

కోఠి నుంచి బోరబండకు కొత్త బస్సు సర్వీస్ ప్రారంభం

ముషీరాబాద్: ముషీరాబాద్ డిపో–2 నుంచి కోఠి నుంచి బోరబండకు 45ఎఫ్ కొత్త రూట్‌కు ఐదు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రకటించారు. కోఠి నుంచి మొదటి బస్సు ఉదయం 6 గంటలకు చివరి బస్సు రాత్రి 7.45 నిమిషాలకు బయలుదేరుతుందన్నారు. బోరబండ నుంచి మొదటి బస్సు ఉదయం 7.05 నిమిషాలకు, చివరి బస్సు రాత్రి 8.50 నిమిషాలకు బయలుదేరుతుందని తెలిపారు. ప్రతి 20 నిమిషాలకు కోఠి నుంచి, ప్రతి 20 నిమిషాలకు బోరబండ నుంచి బస్సులు బయలుదేరుతాయని తెలిపారు. ఇవి కోఠి నుంచి బయలుదేరి కాచిగూడ, చిక్కడపల్లి, ముషీరాబాద్, కవాడిగూడ, జేమ్స్ స్ట్రీట్, పోలీస్ లైన్, లాల్ బంగ్లా, ఎస్ఆర్‌నగర్, ఎర్రగడ్డ మీదుగా బోరబండకు వెళ్తాయని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలకు నేరుగా వెళ్లేందుకు ఈ బస్సులు ఉపయోగపడతాయని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ తెలిపారు.

బచ్‌పన్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు

చిక్కడపల్లి: గాంధీనగర్ బచ్‌పన్ ప్లే స్కూల్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మంగళవారం చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సాంకేతికను అందిపుచ్చుకుని ఉన్నతంగా రాణించేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. బచ్‌పన్ విద్యా సంస్థల డైరెక్టర్ రూపారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కౌశిక్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చిక్కడపల్లి: పేద మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరం అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్ డివిజన్‌లో ఎమ్మెల్యే ముఠాగోపాల్ లబ్ధిదారుల ఇంటికెళ్లి సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే స్వయంగా ఇంటికొచ్చి చెక్కులు ఇవ్వడంతో లబ్ధిదారులకు హర్షం వ్యక్తం చేశారు. సుభాష్‌బాబు రూ.60,000, మహేందర్ రూ.60,000, నవ్య రూ.60,000, బన్నీ రూ.40,000, షేక్ జమాలుద్దీన్ రూ.30,000, శ్రీలత రూ.20,000, భిక్షపతి రూ.12,000, ఎప్సిబా రూ.30,000, విరమేశ్ రూ.20,000 లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యం గురించి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు ముఠా జైసింహ, పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు రాకేష్‌కుమార్, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మానరేష్ దంపతులు, ముచ్చకుర్తి ప్రభాకర్ పద్మదంపతులు, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, గుండు జగదీశ్‌బాబు, శ్రీనివాస్, గడ్డమీది శ్రీనివాస్, గిరి, పాశంరవి, ఆనంద్, జహంగీర్, దేవయ్య, భాస్కర్‌రెడ్డి, రాజేందర్‌లక్ష్మీ దంపతులు పాల్గొన్నారు.

'కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి నిధుల కోత'

కవాడిగూడ: కేంద్ర బడ్జెట్‌లో మైనార్టీల సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించడం దారుణమని సీపీఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపీ ఇన్సాఫ్ జాతీయ అధ్యక్షుడు సయ్యద్ అజీజ్‌పాషా అన్నారు. ప్రజాస్వామ్యంలో మైనార్టీలు ఎంతో కీలక పాత్ర పోషిస్తున్నారని దేశంలోని మైనార్టీల సంక్షేమానికి కేంద్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించి అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఇన్సాఫ్ తెలంగాణ సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మైనార్టీల బడ్జెట్‌లో 38 శాతం కోత విధించారని ఆరోపించారు. 2023–24 సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌ను పెంచి రూ. 10 వేల కోట్లు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మునీర్, నాయకులు పటేల్ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గంగపుత్ర సంఘం నాయకుడి మృతి

ముషీరాబాద్: ముషీరాబాద్ గంగపుత్ర సంఘం సీనియర్ నాయకుడు గాండ్ల మల్లేష్ (85) మంగళవారం అనారోగ్యంతో కుమ్మరి సంఘం వీధిలోని తన నివాసంలో మృతి చెందారు. గంగపుత్ర సంఘం అభివృద్ధికి, స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, నగర నాయకుడు పూస గోరఖ్‌నాథ్‌లు మల్లేష్ భౌతికకాయాన్ని సందర్శించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలు పార్శిగుట్టలోని శ్మశానవాటికలో నిర్వహించారు.

‘ఖేలో తెలంగాణ - జీతో తెలంగాణ’

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన ఖోఖో, కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి

కాచిగూడ: 'ఖేలో తెలంగాణ – జీతో తెలంగాణ' క్రీడోత్సవాల్లో భాగంగా కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో కబడ్డీ, ఖోఖో పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన క్రీడాకారులతో క్రీడా మైదానం కళకళలాడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రీడలకు ఆదరణ పెరిగిందని క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. 'ఖేలో తెలంగాణ జీతో తెలంగాణ' క్రీడోత్సవాల్లో భాగంగా కాచిగూడలో జూనియర్ కాలేజ్ గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన కబడ్డీ, ఖోఖో పోటీలను కేంద్రమంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత ఈ వయస్సులోనే క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పట్టుదల, కృషి ఉంటేనే క్రీడల్లో రాణించవచ్చని ఔత్సాహిక క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో ప్రతిభను చాటుకోవాలని సూచించారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కావ్యాకిషన్‌రెడ్డి, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృత, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు గీతామూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భరత్‌రెడ్డి, బీజేపీ నేతలు వెంకట్‌రెడ్డి, నందకిషోర్, సూర్యప్రకాష్ సింగ్, రమేష్, జ్యోతిరెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలత, సంతోష్, అరవింద్, ఎం.నర్సింగ్‌రావు, ఎస్.రాము, రవియాదవ్ పాల్గొన్నారు.



క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

అంబర్‌పేట: యువత క్రీడా స్ఫూర్తితో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. కేలో తెలంగాణ..జీతో తెలంగాణ జీతో తెలంగాణ క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో కేంద్ర మంత్రి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీల్లో యువత పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతంరావు, గద్వాల జిల్లా ఇన్‌చార్జ్ వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి, నాయకులు డివిజన్ అధ్యక్షులు భూషన్‌చారి, కృష్ణముదిరాజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

కవాడిగూడ: యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంతో పాటు మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయని కార్పొరేటర్లు జి.రచనశ్రీ, కె.రవిచారి, ఎ.పావనివినయ్‌కుమార్‌లు అన్నారు. సికింద్రాబాద్ ఎంపీ కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఖేలో సికింద్రాబాద్ జీతో సికింద్రాబాద్ క్రీడా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో యువతకు క్రికెట్, ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించి యువత దేశానికి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం సికింద్రాబాద్ జిల్లా స్పోర్ట్స్ ఇన్‌చార్జ్, బీజేవైఎం నగర అధ్యక్షులు శివాజీ మాట్లాడుతూ.. మొదటి రోజు ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన 14 క్రికెట్ టీమ్‌లు, 14 ఖోఖో టీమ్‌లు క్రీడల్లో పాల్గొన్నారన్నారు. మరో మూడు రోజుల పాటు దోమలగూడ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో జరుగుతాయన్నారు. ఈ క్రీడా పోటీలను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, రంగరాజ్‌గౌడ్, ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షులు సలంద్రి శ్రీనివాస్ యాదవ్, దిశ కమిటీ మాజీ సభ్యులు వెంకటేష్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు వినయ్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎంపీ మహేందర్‌బాబు, ప్రభాకర్‌గంగపుత్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు పూజరాజు, సురేష్‌ముదిరాజ్, శ్రీనివాస్‌ముదిరాజ్, వెంకటేష్, కుమార్‌గౌడ్, దిలీప్ యాదవ్, అనిల్, నవీన్ తదితరులున్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం..

ముషీరాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి సతీమణి కావ్యరెడ్డి అన్నారు. సోమవారం ముషీరాబాద్ డివిజన్ జీహెచ్ఎంసీ వాలీబాల్ క్రీడా మైదానంలో బీజేపీ ఆధ్వర్యంలో 'ఖేలో తెలంగాణ– జీతో తెలంగాణ' పేరిట నిర్వహిస్తున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి వాలీబాల్ క్రీడా పోటీలు (సికింద్రాబాద్ స్పోర్ట్స్ ఫెస్టివల్) ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా కావ్యరెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుప్రియనవీన్‌గౌడ్ కలిసి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించేందుకు విద్యార్థులు, యువత దృష్టి సారించాలన్నారు. దీనికి తల్లిదండ్రులు కూడా సహకరించాలని కోరారు. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసి మరింతగా ప్రోత్సహించాలని ప్రధాని పిలుపు మేరకు నిర్వహిస్తున్న పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. బీజేపీ నియోజకవర్గ కో– కన్వీనర్ నవీన్‌గౌడ్, నేతలు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, బద్రీనారాయణ, సత్యనారాయణ, కంచికుమార్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

సీపీఐ అనుబంధ సంఘాల కమిటీలు రద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వెంకటస్వామి

కాచిగూడ: సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కమిటీలను రద్దు చేసినట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటస్వామి ప్రకటించారు. మంగళవారం నారాయణగూడ లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర సహ కార్యదర్శి మాధవరెడ్డి అధ్యక్షతన పార్టీ ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నేత మహేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. పార్టీ అనుబంధ ప్రజా సంఘాల నిర్మాణం చేయనందునే పార్టీ ఎదుగుదలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. త్వరలోనే పూర్తి స్థాయిలో కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ అనుబంధ ప్రజా సంఘాల ఏర్పాటు అనంతరం పార్టీ మహాసభలను నిర్వహించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు.

తాటి, ఈత వనాలను ప్రభుత్వమే సంరక్షించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో తాటి, ఈత వనాలను ప్రభుత్వమే సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకపోతుల రమణ డిమాండ్ చేశారు. గీత కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఐదు లక్షల కల్లు గీత కార్మిక కుటుంబాలు ఉన్నాయని వారికి ఉపాధి కల్పించే తాటి, ఈత చెట్లను రియాల్టర్స్ ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాటి, ఈత చెట్లను విపరీతంగా నరికి వేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారంలో భాగంగా లక్షలాది చెట్లను నాటుతున్న ప్రభుత్వం ఇప్పటికే నాటిన తాటి, ఈత చెట్లను సంరక్షించే చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యక్షులు వెంకటనర్సయ్య, వెంకటమల్లయ్య, వెంకన్న, జయరాములు, సీతారాములు, రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు తదితరులున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేకపోతుల రమణ

తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించాలి



చంద్రబాబునగర్‌లో అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి

లాలాపేట: ఇంట్లోని చెత్తను తడి పొడిగా వేరు చేసి చెత్త సేకరించే కార్మికులకు అందించడం ప్రజలందరి బాధ్యత అని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి అన్నారు. రాంకీ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం లాలాపేట చంద్రబాబునగర్‌లో నిర్వహించిన స్వచ్ఛ భారత్ అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రాంకీ సంస్థ సిబ్బంది, జీహెచ్ఎంసీ కార్మికులతో ఇంటింటికి తిరిగి చెత్త నిర్వాహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. దీంతో పాటుగా పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాంకీ సంస్థ సర్కిల్ ఇంచార్జ్ దశరథ్, సానిటరీ సూపర్‌వైజర్ స్వర్ణ పద్మావతి, మానస గౌడ్, ఎస్ఎఫ్ఏ యాకయ్య, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలి

ఎంటమాలజీ అధికారులు, సిబ్బందితో మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. దోమల నివారణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ప్రతి ఆదివారం పది నిమిషాలు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించేలా ప్రజలను చైతన్యం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే దోమల నివారణకు డ్రోన్‌ల ద్వారా రసాయనాలను పిచికారి చేయాలన్నారు. సమావేశంలో అధికారులు రాంబాబు, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, యూసుఫ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటంతోనే ప్రజా సమస్యల పరిష్కారం


అడ్డగుట్ట: పోరాటాలతోనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఛాయదేవి అన్నారు. మంగళవారం అడ్డగుట్టలోని సీపీఐ కార్యాలయంలో సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆమె సీపీఐ సికింద్రాబాద్ మూడోసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. ఉద్యమాలు, పోరాటాల ద్వారానే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని, స్థానిక సమస్యలపై పోరాడేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అడ్డగుట్టలో తాగునీరు, డ్రైనేజీ సమస్యలతో పాటు కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల ఊసే మరిచారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికార పార్టీ విఫలమైందన్నారు. స్టాలిన్, ఉమర్ ఖాన్, సోమయ్య, లతీఫ్, మహ్మద్ యూసుఫ్, వెంకటయ్య, డేవిడ్ పాల్గొన్నారు.

యోగా చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం



నల్లకుంట: పుష్పాంజలి యోగా చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్న పలువురిని సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ నల్లకుంటకు చెందిన బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్‌రాజ్‌కు జ్ఞాపికను అందజేసి శాలువాతో సన్మానించారు. గ్లోబల్ హ్యూమెన్ రైట్స్ చైర్మన్ డాక్టర్ బాబు మిరియం, రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా చైర్మన్ భీమిరెడ్డి, ప్రముఖ సంఘ సేవకులు విశ్రాంత ఐఏఎస్ అధికారి జేవీ రాజు, ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుష్పలత, సంస్థ ఎండీ లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌తో పేదల జీవితాల్లో వెలుగు



సీఎంఆర్ఎఫ్ పత్రాన్ని అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సీఎంఆర్ఎఫ్ ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని లలితా నగర్ ప్రాంతానికి చెందిన నాగేశ్వర్‌రావు అనారోగ్య సమస్యలతో అత్యవసరంగా ఆస్పత్రిలో చేరాడు. సమాచారం అందుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ ముఖ్యమంత్రి కార్యాలయం, రెవెన్యూ అధికారులను సంప్రదించి నాగేశ్వర్‌రావుకు చికిత్స నిమిత్తం రూ. 5 లక్షల ఆర్థిక సాయాన్ని సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను మంగళవారం బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు.

భారత్ జోడో యాత్రను మర్చిపోను

ఉస్మానియా యూనివర్సిటీ: జీవించినంతకాలం భారత్ జోడో యాత్రను మర్చిపోనని ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్ తమిళనాడు ఇన్‌ఛార్జి, ఓయూ పూర్వవిద్యార్థి డాక్టర్ కేతూరి వెంకటేష్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట 2009 మలిదశ తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఓయూ జేఏసీ నాయకులు వెంకటేష్‌ను ఘనంగా సన్మానించారు. గతంలో ఓయూ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా పని చేసిన తనకు రాహుల్‌గాంధీతో కలిసి కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్రలో పాల్గొనే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు. ఐదు నెలలు, 14 రాష్ట్రాలు, 4084 కిలోమీటర్ల భారత్ జోడో యాత్రలో పాల్గొని ప్రజల స్థితిగతులు తెలుసుకున్నానని దేశ ఐక్యత, అభివృద్ధికి జీవితాంతం సేవలందిస్తానన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి



బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెడ్ కాన్వెంట్ హైస్కూల్ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రణాళికాబద్ధంగా విద్యను అభ్యసిస్తే ఉన్నత శిఖరాలను చేరుకుంటారన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలన్నారు. విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే వారు సమాజానికి మంచి సేవలు అందిస్తారన్నారు. ఓయూ ప్రొఫెసర్ ప్రసాద్, స్కూల్ కరస్పాండెంట్ రఘు, ప్రిన్సిపల్ సౌజన్య పాల్గొన్నారు.

టీఎంహెచ్ఈయూ డైరీ ఆవిష్కరణ



హోం మంత్రి మహమూద్ అలీ తదితరులు

నల్లకుంట: తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీఎంహెచ్ఈయూ) రూపొందించిన డైరీ, కేలండర్‌ను మంగళవారం హోం మంత్రి మహమూద్ అలీ ఆవిష్కరించారు. టీఎంహెచ్ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు రాబర్ట్‌బ్రూస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్, అసోసియేటివ్ ప్రెసిడెంట్ ఎండీ ఫారూఖ్, ఉపాధ్యక్షుడు హనుమంతరావు, సంయుక్త కార్యదర్శి పారూఖ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఉత్తమం

చిక్కడపల్లి: ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం ఉత్తమమైందని చిక్కడపల్లి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేష్‌గుప్తా అన్నారు. సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. అన్నదాతలు ప్రొద్దుటూరు నరసింహారావు, శ్రీనివాస్, సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, కోశాధికారి శ్రీనివాస్, అదనపు కార్యదర్శి బాలకుమార్, శ్రీనివాస్, సురేందర్‌గుప్తా, బాలచందర్, కేవీవీ ప్రసాద్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రశ్నించే గొంతుకలకు పట్టం కట్టండి



సమావేశంలో మాట్లాడుతున్న పూనంనేని సాంబశివరావు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రశ్నించే గొంతుకలకు పట్టం కట్టాలని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని వీఎస్‌టీ ఫంక్షన్‌హాల్‌లో ఎస్‌టీయూటీఎస్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి భుజంగరావు నామినేషన్ సందర్భంగా జరిగిన సదస్సులో సాంబశివరావు మాట్లాడారు. ప్రభుత్వానికి సాగిల్లపడే గొంతులను సాగనంపాల్సిన అవసరం ఉందని విద్యా రంగాన్ని సమస్యల నుంచి బయటపడేసేందుకు సమర్థవంతమైన నాయకుడినే ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నుకోవాలన్నారు.

- గత 30 ఏళ్లుగా విద్యా రంగంలో సేవలు అందించిన అనుభవంతో భుజంగరావును టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బలపరుస్తున్నామని ఆయన శాసన మండలిలో అడుగుపెడితే విద్యా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే విశ్వాసం ఉందన్నారు. ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందంగౌడ్, ప్రధాన కార్యదర్శి పర్వత్‌రెడ్డి, టీపీటీయూ అధ్యక్షుడు ఎం.రాధాకృష్ణ, టీఎస్‌టీడబ్ల్యూటీయూ అధ్యక్షులు డీ.వీ.రావు, ఎంటీయూ అధ్యక్షులు అలీమ్, ఏటీపీ అధ్యక్షులు సాగర్‌రావు, ఎస్‌టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దళిత బంధుకు కేటాయించిన నిధులు విడుదల చేయాలి

కవాడిగూడ: తెలంగాణ బడ్జెట్‌లో దళిత బంధు పథకానికి కేటాయించిన రూ.17,700 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేసి లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేయాలని తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డ యాదయ్య మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో దళిత బంధు పథకం కోసం కేటాయించిన నిధులను సక్రమంగా విడుదల చేసి లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగవారం ఇందిరాపార్కు వద్ద తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం, మహా ఎంఆర్‌పీఎస్, తెలంగాణ దండోరాల సంయుక్త ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదయ్య మాదిగ, వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగ్‌రావు మాదిగ, రాము మాదిగ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. దళిత బంధు పథకం కోసం కేటాయించిన నిధులను మార్చి లోపే విడుదల చేసి అర్హులైన లబ్ధిదారులకు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. పి.లాలయ్య, శేఖర్‌మాదిగ, సూర్యనారాయణ, సరస్వతి, రాంచందర్, జంగయ్య, గోపాల్, మహేందర్, రత్నం, శ్రీనివాస్, జాజుల రమ్య, కిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దివ్యాంగులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నామినేటెడ్ పోస్టుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం చిక్కడపల్లిలో ఎన్‌పీఆర్‌డీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 13 ఏళ్లలో వికలాంగుల సంక్షేమానికి పాలకులు ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు.

- 2016 ఆర్‌పీడీ చట్టం, ఆర్‌సీఐ, మానసిక వికలాంగుల చట్టం లాంటి వాటిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వికలాంగులకు చేయూతనివ్వడంలో ప్రభుత్వాలు చేస్తున్న నిర్లక్ష్యాన్ని సహించబోమని హెచ్చరించారు. ఖాళీ ఉన్న బ్లాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్‌పీఆర్‌డీ అధ్యక్షులు వెంకట్, కోశాధికారి ఆర్.వెంకటేష్, గ్రేటర్ ఉపాధ్యక్షులు ఎం.డీ.యూసుఫ్, శివశంకర్, రమేష్, ఉషా, లక్ష్మమ్మ తదితరులున్నారు.

హాస్పిటల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న వడ్డెర బస్తీ నేతలు

లాలాపేట: హాస్పిటల్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన అఖిల పక్ష నేతల బృందం బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆలకుంట హరి ఆధ్వర్యంలో మంగళవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 30 వేల జనాభా మాణికేశ్వరి నగర్‌లో వైద్య సదుపాయాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మాణికేశ్వర్‌నగర్ కమాన్ పక్కన ఉన్న సర్వే నెంబర్ 169 స్థలాన్ని గతంలో ప్రభుత్వ దవాఖాన ఏర్పాటుకు కేటాయించిందన్నారు. అయితే ప్రస్తుత ఓయూ అధికారులు సదరు స్థలం తమదంటూ వివాదాన్ని లేవనెత్తారని పేర్కొన్నారు. సదరు స్థల వివాదాన్ని పరిష్కరించి అక్కడ గవర్నమెంట్ హాస్పిటల్ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై గతంలో పలు మార్లు వినతి పత్రం ఇచ్చామని బస్తీ నాయకులు మంత్రికి గుర్తు చేశారు. కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు గండికోట విజయ్‌కుమార్, ఏ శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, గండికోట నర్సింహ, మల్లేశం, రవితేజ, కళ్యాణ్ పాల్గొన్నారు.